సీబీఐ అధికారినంటూ.. హంగామా !

కేసు నమోదు చేసిన పోలీసులు

మణికొండ: తాను సీబీఐ అధికారినని, విల్లా నెంబర్ 47లోని ఓ వ్యక్తిని విచారించాలంటూ.. గేటెడ్ కమ్యూనిటీలోకి అనుమతి లేకుండా ఓ వ్యక్తిపై ఎస్టేట్ అధికారి ఫిర్యాదు చేయడంతో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన నాగమల్లేశ్వర్ గండిపేట రోడ్డులోని ఓ గేటెడ్ కమ్యూనిటీలోకి గురువారం రాత్రి చొరబడ్డాడు. విల్లాలో నివాసం ఉంటున్న వారిని కలవాలని దబాయించాడు. సెక్యూరిటీ వారు వారించినా వినిపించుకోకుండా సదరు విల్లా వద్దకు వెళ్లి గొడవ చేశాడు. డబ్బు విషయమై వచ్చానని చెప్పగా.. అలాంటి లావాదేవీలు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వారిని వెంట తీసుకుని రావాలని సిబ్బంది సదరు వ్యక్తికి సూచించారు. రెండు గంటల పాటు సర్ది చెప్పినా వినిపించుకోకపోవడంతో ఎస్టేట్ అధికారి సంతోష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చామంతి ఆల్‌టైమ్ రికార్డ్...

- మార్కెట్‌లో కిలో రూ.450
- మిగతా పూల ధరలు ఇదే బాటలో..


హైదరాబాద్ పూల మార్కెట్‌లో పూల విక్రయం

శంషాబాద్ రూరల్: మార్కెట్‌లో పూల ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. వేసవి సీజన్‌లో చామంతి పూలు ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. హైదరాబాద్‌లోని గుడి మల్కాపూర్ మార్కెట్‌లో గత రెండ్రోజుల నుంచి చామంతి ధరలు ఆకాశాన్నంటాయి. కిలో రూ.400 నుంచి రూ.450 పలికింది. బంతి, లిల్లీ, గులాబీ ధరలు సైతం ఇదే తరహాలో భారీగా పెరిగాయి. ప్రతి ఏటా దసరా, దీపావళి పండుగ సమయాల్లో మాత్రమే ఈ స్థాయి ధరలు పలుకుతుంటాయి. మొదటిసారి వేసవిలో ఇవే అత్యధిక ధరలు కావడం విశేషం.

కర్ణాటకలో సాగునీటి ఇక్కట్లతో..

కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు పూలను భారీగా దిగుమతి చేసుకుంటారు. అక్కడి నుంచి ప్రస్తుతం దిగుమతులు సగానికి పైగా తగ్గిపోయాయి. చిక్‌బల్లాపూర్, బెంగళూరు మార్కెట్ పరిసరాల నుంచి ఇక్కడికి చామంతి, బంతి దిగుమతి చేసుకుంటారు. లిల్లీ పూలను రాజమండ్రి ప్రాంతం నుంచి తెప్పిస్తారు. అయితే కర్ణాటకలో వర్షాలు సరిగ్గా లేక సాగునీటి ఇక్కట్లతో పూల సాగు తగ్గిపోయింది. దీంతో హైదరాబాద్ మార్కెట్‌కు అక్కడి నుంచి పూల దిగుమతిపై తీవ్ర ప్రభావం పడింది.

శుభకార్యాల కారణంగా ధరలకు రెక్కలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రైతులు సాగు చేసే పూలను హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్తారు. అయితే ఇక్కడి వాతావరణం, నీటి ఎద్దడి కారణాలతో వేసవిలో పూల దిగుబడి తగ్గిపోతుంది. ప్రస్తుతం ఇదే పరిస్థితి కొనసాగుతుండడం.. పెళ్లిళ్లు, శుభకార్యాలకు ముహూర్తాలు ఉండటంతో పూల డిమాండ్ బాగా పెరిగింది. ఓ వైపు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు తగ్గడం.. స్థానికంగా పూల దిగుబడి తగ్గడంతో ధరలు ఆకాశానంటుతున్నాయి.

మార్కెట్‌లో పూల ధరలు ఇలా..

పూలు	ధరలు
చామంతి	కిలో రూ.400-450
బంతి	200-350
లిల్లీ	300-350
గులాబీ	150-200

నెల రోజుల నుంచి ఆశాజనకంగా..

మార్కెట్‌లో పూలకు నెల రోజుల నుంచి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఉగాది పండగ, పెళ్లిళ్ల కారణంగా పూలకు ఉన్న డిమాండ్ ఈనెల చివరి వరకు కొనసాగుతుందని రైతులు ఆశిస్తున్నారు. చామంతి, బంతి పూల తోటల్లో పంట దిగుబడి కూడా రోజు రోజుకు తగ్గిపోతుంది.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భీమార్జున్‌రెడ్డి



బండ్లగూడ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కిస్మత్‌పూర్ మాజీ సర్పంచ్ అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కిస్మత్‌పూర్‌లో ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీకి కట్టుబడి ఉంటూ.. రాబోయే ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేసి చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేద్దామని పిలుపునిచ్చారు.

సన్మానం

మణికొండ: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన మణికొండ మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యుడు జె.సిద్దప్పను పార్టీ నాయకులు శుక్రవారం సన్మానించారు. మణికొండ మున్సిపాలిటీ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు ఎం. రాఘవరెడ్డి, సీహెచ్. ఇందిర, కౌన్సిలర్ ఎల్. వందన, కో–ఆప్షన్ సభ్యురాలు జె.లక్ష్మీరాములు, అనితాదేవి, వేణుకుమార్, నర్సయ్యచారి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


కార్యక్రమానికి హాజరైన భక్తులు, ప్రజలు


హోమంలో పాల్గొన్న దంపతులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని శ్రీ కోట మైసమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ హోమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన దంపతులు పెద్దసంఖ్యలో పాల్గొని హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోమం, పూజలను కొనసాగించారు. మూడ్రోజుల పాటు ఈ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగనున్నాయి. 21న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం ఛండీహోమం నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టారు. దేవాలయంతో పాటు స్థానిక బస్తీలను వివిధ రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవాలయ కమిటీ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

అత్తాపూర్ : నియమనిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొందరు బిల్డర్లు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా అధికారుల్లో మార్పు కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతూ వ్యాపారాలు జోరుగా సాగిస్తున్నారని మండిపడుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమయాల్లో మాత్రమే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

– 15 టన్నుల బియ్యం, డీసీఎం స్వాధీనం

రాజేంద్రనగర్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎస్‌ఓటీ రాజేంద్రనగర్, రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 15 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన సల్మాన్ అనే వ్యక్తి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి మహారాష్ట్ర ఉమెర్గాకు చెందిన ధన్‌రాజ్‌కు సరఫరా చేస్తుంటాడు. కాగా మహారాష్ట్ర లాథూర్ నీలంగాకు చెందిన అమేర్ మహినూబ్ షేక్ (26) డీసీఎం వాహనం (ఎంహెచ్ 24 ఏబీ 6253)లో మహారాష్ట్రకు 15 టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా... రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు రాజేంద్రనగర్‌లోని మానస హిల్స్ మెయిన్ రోడ్డులో తనిఖీలు నిర్వహించగా.. రేషన్ బియ్యంతో పట్టుకున్నారు. అమేర్‌ను అరెస్ట్ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగ, తాగునీటి ప్యాకెట్ల పంపిణీ

గోల్కొండ: గోల్కొండ కోట వద్ద పర్యాటకులకు తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ వారు మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు కోటకు వస్తుంటారని, తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్నామని కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ పహద్ అన్నారు. శుక్రవారం టీఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో గోల్కొండ కోట మొయిన్‌గేట్, డెక్కన్ పార్కు, సెవన్ టూమ్స్ చౌరస్తా వద్ద పర్యాటకులకు తమ ఆర్గనైజేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా చల్లటి తాగునీరు, మజ్జిగ అందజేసినట్లు తెలిపారు.

రెండో రోజు మూడు నామినేషన్లు

చేవెళ్ల ఎంపీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు


ఎంసీపీఐ(యూ) పార్టీ అభ్యర్థిగా వనం సుధాకర్


బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్ తరపున మేకల భిక్షపతి


ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ తరపున చాంద్ పాషా

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజు శుక్రవారం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. బీఎల్‌ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎంసీపీఐ(యూ) పార్టీ అభ్యర్థిగా వనం సుధాకర్, ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ చాంద్ పాషా, బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ తరపున ప్రతిపాదకులు మేకల భిక్షపతి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు అందజేశారు. తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలు కాగా... రెండోరోజు మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో నియోజకవర్గానికి మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి శశాంక ప్రకటించారు.

కార్మిక సంఘం అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమయ్య

రాజేంద్రనగర్: 'బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్' రంగారెడ్డి జిల్లా కమిటీ కాటేదాన్‌లోని కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జీఎం.కురుమయ్య అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ.. సంఘం జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి కోసం రంగారెడ్డి నాయకత్వం సమిష్టిగా కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో సంఘం పెంచడంతో పాటు కార్మికుల సమస్యలపై అవగాహనతో పనిచేయాలన్నారు. జిల్లా కోశాధికారి చైతన్య, సభ్యులు ఎం.జంగయ్య, పార్వతీ, మొగులయ్య, సీఐటీయూ నాయకులు ఎస్.జంగయ్య, ఎల్లయ్య, గడ్డి యాదయ్య, ఎం.శంకర్, కె.శంకర్, ఆకుల యాదయ్య, కె.రాజు పాల్గొన్నారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూ రిజిస్ట్రార్‌గా ప్రొ.మధుకర్

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ జి.మధుకర్ నియమితులయ్యారు. ఇంతకు ముందు ఇక్కడ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ అప్లయిడ్ ఆర్ట్స్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ..విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు యూనివర్సిటీ ఉపాధ్యాయులతో కలిసి కృషి చేస్తానన్నారు.

కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: గ్రామీణ క్రీడాకారుల కోసం ఆరెకరాల స్థలంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తున్నామని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ట్రోఫీలు అందజేశారు. మహవీర్ కళాశాల వ్యవస్థాపకుడు సంరెడ్డి సుదర్శన్ రెడ్డి ఆశయ సాధనకు యాజమాన్యం కృషి చేస్తుందని సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. క్రీడాకారుల కోసం క్రికెట్ స్టేడియం తొందరలో పూర్తి చేస్తామన్నారు. కళాశాలలో నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ సంరెడ్డి జయమ్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్ రెడ్డి, కోశాధికారి అగ్నిహోత్రి, ప్రిన్సిపాల్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ జీఎంగా శ్యామ్‌సుందర్


శ్యామ్‌సుందర్‌నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: జలమండలి రాజేంద్రనగర్ జనరల్ మేనేజర్‌గా శ్యామ్‌సుందర్ నాయక్ బదిలీపై వచ్చారు. శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను నాయకులు, బిల్లింగ్ మీటర్ రీడర్లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం వేసవిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు సరఫరా చేస్తామన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రజల సహకారంతో పరిపాలన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కమిటీ రద్దు చేయాలి

హెచ్‌సీయూ పరిపాలనా భవనం ఎదుట ఎస్ఎఫ్ఐ, స్టూడెంట్స్ యూనియన్, ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన



రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో చోటు చేసుకున్న ఘటనలపై వేసిన కమిటీ తక్షణం రద్దు చేయాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ఎదుట స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్‌లో జరిగిన ఘటనలపై విచారణ చేపట్టేందుకు కమిటీని వేయడం స్వాగతిస్తామని, కానీ ఒక వర్గానికి మద్దతు ఇచ్చే వారికి ఇందులో చోటు కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. వెంటనే ప్రస్తుత కమిటీని రద్దు చేసి వెంటనే కొత్తగా న్యాయబద్ధంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంపై సిఫార్సు చేసే వారికి కమిటీలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్, నాయకులు మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ డిపోలో 'లక్షే లక్ష్యం చాలెంజ్' ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ డిపో మేనేజర్ శ్రీనాథ్

రాజేంద్రనగర్ : ఇప్పటి వరకు ఇచ్చిన అన్ని చాలెంజ్‌లను రాజేంద్రనగర్ డిపో పూర్తి చేసిందని, ఇప్పుడిచ్చిన 'లక్షే లక్ష్యం' చాలెంజ్‌ను కూడా టీమ్ రాజేంద్రనగర్ ఖచ్చితంగా పూర్తి చేస్తుందని రాజేంద్రనగర్ డిపో మేనేజర్ శ్రీనాథ్ అన్నారు. రాజేంద్రనగర్ డిపోలో శుక్రవారం 'లక్షే లక్ష్యం' కార్యక్రమాన్ని ఆయన అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, ఎస్టీఐ సుశీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గత కొన్నేళ్లుగా టీఎస్‌ఆర్టీసీ సంస్థలో ఎన్నెన్నో కొత్త పథకాలు, చాలెంజ్‌లను నిర్వహిస్తూ.. ఆర్టీసీ సంస్థను ప్రజలకు చాలా దగ్గర చేశారన్నారు. దీనిలో భాగంగా ఇప్పుడు మరొక చాలెంజ్‌ను తీసుకొచ్చారన్నారు. ఈ చాలెంజ్ పేరు "లక్షే లక్ష్యం" చాలెంజ్ ఈ సంవత్సరం ఉగాది– 2024 నుంచి మరుసటి సంవత్సరం ఉగాది– 2025 వరకు అమలుల్లో ఉంటుందన్నారు. ఏడాది పాటు ప్రతి డిపోలో ఇస్తున్న ఎర్నింగ్స్‌కు అదనంగా ప్రతిరోజు ఒక లక్ష రూపాయలను తీసుకురావాలని లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. ఈ లక్ష్యాన్ని అందుకునేలా కృషి చేయాలని ఉద్యోగులకు తెలియజేశారు. దీనికి ఉద్యోగులు కూడా ఖచ్చితంగా ఈ లక్ష్యాన్ని చేరుకుంటారని ప్రతిజ్ఞ చేశారు.

కృషి విజ్ఞాన కేంద్రాలతో రైతులకు మేలు


సదుస్సులో పాల్గొన్న అధికారులు, శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని దీనిని దృష్టిలో ఉంచుకుని దేశంలో అదనంగా 144 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని ప్రస్తుతం ఉన్న వాటిని ఆధునీకరించనున్నట్లు ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్ తెలిపారు. శుక్రవారం తెలంగాణాలోని కృషి విజ్ఞాన కేంద్రాలు 2024–25 సంవత్సరంలో అమలు చేయాల్సిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక గురించి చర్చించేందుకు రెండ్రోజుల సదస్సును రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యా సంస్థ (ఈఈఐ) ప్రారంభించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్ అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (అటారి) సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

టార్చ్ ర్యాలీ..

దేశంలోని తొలి కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటై 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా టార్చ్ ర్యాలీ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ఈ ర్యాలీ నిర్వహించాలని హిమాన్షు పాఠక్ సూచించారు. మేనేజ్ డైరెక్టర్ జనరల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నేడు రైతుల ఆదాయం, లాభదాయకతలు పెంపొందిచడమనేది వ్యవసాయ శాస్త్రవేత్తలు, సంస్థలు నేడు ఎదుర్కొంటున్న ప్రధాన సవాల్ అని ఆయన అభిప్రాయపడ్డారు. పౌష్టికాహార భద్రత సాధించడం చాలా అత్యవసరమన్నారు. అహార ఉత్పత్తుల వృథాను కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా..

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కృషి విజ్ఞాన కేంద్రాలు మార్పులు అందిపుచ్చుకోవాలని చంద్రశేఖర్ సూచించారు. ప్రతి కృషి విజ్ఞాన కేంద్రం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు ఆయా జిల్లాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలుగా రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రైతుల ఉత్పత్తులకు ప్రోత్సాహం..

రైతులు తమ ఉత్పత్తులకు సంబంధించి ప్రాసెసింగ్, విలువ జోడింపు మార్కెటింగ్ విధానాల్లో మెలకువలు నేర్చుకునేలా కేవీకేలు చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులకు కేవీకేలు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. మూస పద్ధతిలో పనిచేసే విధానాలకి స్వస్తి చెప్పి భవిష్యత్తు తరాలకు ఎదురయ్యే సవాళ్లు ఎదుర్కోవడానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

- వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తి ఉత్పాదకతలు పంటల వారీ రానున్న ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కోవడానికి అనుగుణంగా కేవీకేలు మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

5 లక్షల మంది రైతులకు చేరువ..

వివిధ మాధ్యమాల ద్వారా 5 లక్షల మంది రైతులకు చేరువ కాగలిగామని, వాతావరణ మార్పులకు అనుగుణంగా విస్తరణ విధానాల్లో మార్పులు రావాలని ఆయన సూచించారు. నారమ్ డైరెక్టర్ డాక్టర్ సీ.హెచ్. శ్రీనివాస్‌రావు, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు విజయ్, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు మహేందర్ విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు, కేవీకే కో– ఆర్డినేటర్లు పాల్గొన్నారు.


మజ్లిస్ పార్టీని గెలిపించాలి : ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధికి చిరునామా అయిన మజ్లిస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తరఫున ఆయన శుక్రవారం కార్వాన్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ చేసిన అభివృద్ధి పనులు ప్రతి ఒక్కరికీ తెలుసని మజ్లిస్ పార్టీ గురించి కొత్తగా ఏమి చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో తాను ప్రతి డివిజన్, ప్రతి గల్లీలో అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. మజ్లిస్ పార్టీపై హైదరాబాద్ స్థానం నుంచి అసదుద్దీన్ గెలుస్తూ వస్తున్నారంటే ఆయనపై ప్రజలకు ఉన్న విశ్వాసం, ప్రేమాభిమానాలే కారణం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అజీజ్‌ఖాన్ పఠాన్, హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

నిత్యం అన్నదానం

గోల్కొండ: ప్రభుత్వ దవాఖానాలకు వచ్చే రోగులు, వారి సహాయకులకు ప్రతిరోజూ రాత్రి పూట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్ బషీర్ అన్నారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి సరోజీ కంటి ఆసుపత్రి, నీలోఫర్ పిల్లల ఆసుపత్రి, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రికి వైద్య చికిత్సల నిమిత్తం ఇతర జిల్లాల నుంచి ప్రతి నిత్యం ఎందరో వస్తుంటారన్నారు. దాతలు, శ్రేయోభిలాషుల సహకారంతో వీరికి ప్రతిరోజూ రాత్రి భోజన ప్యాకెట్లుతో పాటు వాటర్ బాటిల్స్ అందిస్తున్నామని ఆయన తెలిపారు.

వివాహిత అదృశ్యం



గచ్చిబౌలి: వివాహిత అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... జార్ఖండ్ రాష్ట్రం, పురియో గ్రామానికి చెందిన సబిత్రి బాయి జయభేరి మెడోస్‌లో నివాసముండే సంజయ్ చతుర్వేది ఇంట్లో సత్యమ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ఏజెన్సీ ద్వారా మార్చి 24న పని చేసేందుకు వచ్చింది. గురువారం ఉదయం సంజయ్ చతుర్వేది ఆఫీస్‌కు వెళ్లగా ఆమె ఇంట్లోనే ఉంటుంది. మధ్యాహ్నం చతుర్వేది కుమారుడు అర్మాన్ ఇంటికి వచ్చి చూడగా సబిత్రిబాయి కనిపించలేదు. దీంతో అతను తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.